క్లుప్తంగా

ఆస్నాదకు చేరిన బీసీ హక్కుల సాధన కమిటీ



మాట్లాడుతున్న నాయకులు

చెన్నూర్‌రూరల్: జిల్లా కేంద్రంలో ప్రారంభమైన బీసీ హక్కుల సాధన కమిటీ బీసీ హక్కుల జిల్లా కమిటీ కన్వీనర్ మనోహర్, ప్రధాన కార్యదర్శి రాజన్న, కార్యదర్శి వెంకటేశ్, రాజుల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఆస్నాద గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా బీసీ కులాల నాయకులతో పాటు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీసీల ఐక్యత కోసం ఉద్యమించాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ బీసీ కులాల నాయకులు నరసింహాచారి, శ్రీనివాస్, వెంకటస్వామి, ఉస్మాన్ పాషా, సంపత్, నాజన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు ఎన్నిక

దండేపల్లి: మండలంలోని నంబాల, అల్లీపూర్ గ్రామాల అంబేద్కర్ యువజన సంఘాల కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. నంబాల గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా నాతరి రమేశ్, పర్షమోహన్ తో పాటు మిగితా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అల్లీపూర్ గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఊరడి మల్లేశ్, లింగాల నరేశ్ మిగితా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీల ఎన్నికలో సంఘం మండల అధ్యక్షుడు లింగంపల్లి బాపు, రాష్ట్ర నాయకుడు రాజమల్లు, జిల్లా నాయకులు అంజన్న, రాజన్న, సుభాష్, ఇసాకర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



మంచిర్యాలఅర్బన్: చలివేంద్రం ప్రారంభోత్సవంలో సొసైటీ సభ్యులు

దండేపల్లి/మంచిర్యాలఅర్బన్: వేసవి కాలం దృష్ట్యా దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయం వద్ద ఆలయం తరుపున, గుట్టపై ప్రధాన ఆలయం దగ్గర, గుట్ట కింద ప్రసాదం కౌంటర్ వద్ద లక్సెట్టిపేట శ్రీశివసాయి గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం భక్తుల సౌకర్యం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మంచిర్యాలలోని కాలేజీరోడ్‌లో సాధ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. చలివేంద్రం ప్రారంభించారు.

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలకు తాగునీటిని అందించేందుకు గాను ఐబీ చౌరస్తాలో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్ర రెడ్డి ప్రారంభించారు. ఉగాది సందర్భంగా చలివేంద్రంలో పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, కోశాధికారి కే.సత్యపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, యెడ్ల కిషన్, సత్యనారాయణ రెడ్డి, శంకరయ్య, బుద్దినేని సత్యనారాయణరావు, కాసర్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

రాంజీగోండు వర్ధంతి



తుడుందెబ్బ ఆధ్వర్యంలో నివాళులు

కాసిపేట: మండలంలోని కొండాపూర్ యాప, తాటిగూడ గ్రామాల్లో మంగళవారం ఆదివాసీల ఆధ్వర్యంలో రాంజీగోండు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండాపూర్‌లో తుడుందెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో తాటిగూడలో ఆదివాసీసేన ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. వర్ధంతిని ఆదివాసీ గ్రామాల్లో భారీ ఎత్తున నిర్వహించాలని, పాఠ్యపుస్తకాలలో రాంజీగోండు చరిత్రను చేర్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు మడావి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పేంద్రం శంకర్, మడావి శేఖర్, అర్జు, మడావి రాజేష్, కొండాపూర్‌లో తుడుందెబ్బ రాష్ట్ర కోశాధికారి ఆడ జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పేంద్రం హన్మంతు, మండల గౌరవ అధ్యక్షుడు ఆత్రం జంగు, మండల అధ్యక్షుడు సంద్ర భూమన్న, కుర్సింగ తిరుపతి, గోవర్దన్, రాందాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్: అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న మేనేజర్ తిరుపతి దంపతులు



ఆస్నాదలో మహమ్మాయి అమ్మవారి పూజల్లో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు



నెన్నెల: పనిముట్లకు పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఘనంగా ఉగాది

- క్రోధినామ సంవత్సరానికి స్వాగతం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- అరక కట్టి పనులు ప్రారంభించిన రైతులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఉగాది పర్వదిన వేడుకలను మంగళవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రోధి నామ తెలుగు సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటి లోగిళ్లు, గుమ్మాలకు మామిడి తోరణాలను అందంగా అలంకరించారు. షడ్రుచులతో పచ్చడి చేసి రుచి చూడగా, నేతితో బూరెలు చేసి ఆరగించారు. తెల్లవారుజామున మహిళలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చేసి రాశిఫలాల వల్ల కలిగే ప్రయోజనాలను భక్తులకు వివరించారు. కొందరు తెలుగు కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని శుభ కార్యాలకు శ్రీకారం చుట్టగా, రైతులు అరక కట్టి సాగుబాటపట్టారు. పంటలు బాగా పండాలని వేడుకున్నారు. విశ్వబ్రాహ్మణులు తమ ఇళ్లలో మహమ్మాయి వేడుకలను వైభవోపేతంగా జరుపుకున్నారు. పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసి ఉగాది పచ్చడి, భచ్చాలు పంపిణీ చేశారు. ఆర్కే 6 గనిపై ప్రతీ ఉగాది సందర్భంగా దుర్గామాత ఆలయంలో వసంత నవ రాత్రి ఉత్సవాలను ప్రారంభించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గని మేనేజర్ తిరుపతి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.



బెల్లంపల్లి: సీఓఈలో పచ్చడి పంపిణీ



ముల్కల్లలో పచ్చడి పంపిణీ చేస్తున్న నాయకులు



మందమర్రిలో పచ్చడి పంపిణీ



దండేపల్లి: మార్కండేయ ఆలయంలో పచ్చడి పంపిణీ



జైపూర్: పవర్ ప్లాంట్ వద్ద..



తాండూర్‌లో పంచాంగ శ్రవణం



కాసిపేట: పంచాంగం చెప్తున్న పూజారి



లక్సెట్టిపేటలో...



భీమిని: అభయాంజనేయస్వామి ఆలయంలో...



ఎల్లాపు భవన్‌లో పంచాంగపఠనం



బుగ్గ రాజేశ్వర ఆలయంలో...



చెన్నూర్ శివాలయంలో పంచాంగ శ్రవణం



ఒత్కులపల్లి అభయాంజనేయ స్వామి ఆలయంలో...



రేండ్లగూడ రామాలయంలో భక్తుల పూజలు



భీమారంలోని కోదండరామాలయంలో...

రోడ్లపైనే కూరగాయల అమ్మకాలు

- సౌకర్యాల కల్పించడంలో అధికారులు విఫలం
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, వినియోగదారులు

చెన్నూర్: అధికారుల నిర్లక్ష్యం కూరగాయల వ్యాపారులకు శాపంగా మారింది. కూరగాయల మార్కెట్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. వ్యాపారుల వద్ద తైబజార్ వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు, వ్యాపారులకు కనీసం షెడ్లు ఏర్పాటు చేయలేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎండలు తీవ్రం కావడంతో వ్యాపారులు గోసపడుతున్నారు. అధికారులు చెన్నూర్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం పూర్తి చేస్తే వ్యాపారులకు మేలు జరిగే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

రోజుకు వందకు పైగా వ్యాపారులు..

చెన్నూర్ కూరగాయల మార్కెట్‌లో నిత్యం వందకు పైగా చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల నుంచి రైతులు, వ్యాపారులు కూరగాయల వ్యాపారం సాగిస్తుంటారు. మార్కెట్లో నిలువ నీడ లేకపోవడంతో ఎండలోనే విక్రయాలు సాగిస్తున్నారు. వ్యాపారులకు కనీసం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వ్యాపారాలు సాగిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళా వ్యాపారులు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో కనీసం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.



చెన్నూర్ జగన్నాథాలయం ఎదుట రోడ్ల పై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

నీడ లేక వ్యాపారం సాగక..



రోజంతా కూరగాయలు అమ్మితే మూడు నుంచి నాలుగు వందలు గిట్టుబాటు అయితాంది. ఎండ, వాన కాలాల్లో షెడ్లు లేక వ్యాపారం సక్కగా సాగదు. మున్సిపల్ అధికారులు రోజు రూ.పది చొప్పున నెలకు రూ. 300 వసూలు చేస్తున్నారు. తాగేందుకు నీళ్లు లేవు. షెడ్లు కట్టి వసూలు చేస్తే బాగుండేది.

– శంకరమ్మ, కూరగాయల వ్యాపారి

గోసైతంది..



కూరగాయలు అమ్మితే ఇల్లు గడుస్తోంది. పొద్దుగాల వచ్చి పగటి వరకు ఎండకు ఎండుతున్నాం. వానకు తడుస్తున్నాం. ఏ అధికారి మమ్ముల్ని పట్టించుకుంట లేరు. కూరగాయలు అమ్మేటోళ్లు ఎక్కువ మహిళలమే. అన్నింటికీ ఇబ్బంది పడుతున్నాం. అధికారులు మా గోసను పట్టించుకొని మాకు నీడ కల్పించాలి.

– దాసరి లచ్చవ్వ, వ్యాపారి

పూలే సంస్కృతిని ఆచరించాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

పాతమంచిర్యాల: మహాత్మా జ్యోతిబాపూలే అందించిన సంస్కృతీ, సంప్రదాయాలను బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజన వర్గాల ప్రజలు ఆచరించాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో మంగళవారం 'పూలే ఉగాది వేడుకలు' జరుపుకున్నారు. ప్రకృతిలో జరిగే మార్పులకు సూచనగా ఉగాది పండగ అని వక్తలు పేర్కొన్నారు. బహుజన వర్గాల శ్రమతోనే ప్రపంచం మనుగడ సాగిస్తుందని, మనువాధులు ప్రవచించే మంత్రాలు, పంచాంగలతో కాదనే విషయాన్ని నేటి ప్రజలు గ్రహించాలన్నారు. ఆదిపత్య వర్గాల సంస్కృతిని కూలదోసి పూలే, అంబేద్కర్లు చూపించిన బాటలో నడవాలన్నారు. కష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, కులవివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం జిల్లా కార్యదర్శి డి.మోహన్, బీసీ ఐక్యవేదిక నాయకులు కనుకుట్ల మల్లయ్య, బుద్ది చంద్రమౌళి, బహుజన ఐక్యవేదిక నాయకులు పలిగిరి కనకరాజు, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి కన్వీనర్ రామదాసు, సింగరేణి ఐక్యవేదిక నాయకులు పి.కోటిలింగం, సామాజిక ఉద్యమకారులు జయరాజ్, కొండయ్య, కైలాసం, జెట్టి చరణ్‌దాస్ పాల్గొన్నారు.

'కోల్‌బెల్ట్'లో కళాకారులకు కొదువలేదు

- దసరా సినిమా మాటలు, పాటల రచయిత సురేష్
- సేవలందించిన పలువురికి సన్మానం



పురస్కారం అందిస్తున్న చంద్రశేఖర్

మందమర్రిరూరల్: కోల్‌బెల్ట్ ఏరియాలో కళాకారులకు కొదువలేదని దసరా సినిమా మాటలు, పాటల రచయిత సురేష్ పేర్కొన్నారు. ఉగాది వేడుకలను పురస్కరించుకొని స్థానిక శ్రీమంజునాథ గార్డెన్‌లో తెలంగాణ బాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఓ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. వేడుకలకు పలువురు నాయకులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలు సేవా రంగాల్లో సేవలందించిన పట్టణానికి చెందిన పలువురికి పురస్కారాలు అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం కవులు కవితా గోష్టి నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్యులు డింగరి కృష్ణ చైతన్యం సభ్యులకు పంచాంగ శ్రవణం వినిపించారు. కార్యక్రమంలో రచయిత అల్లాడి శ్రీనివాస్, రవీందర్, దక్షిణమూర్తి, వెంకటేశ్వర్లు, అంతడుపుల నాగరాజ్, ఉప్పులేటి నరేష్, సీపీఐ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందిస్తున్న రఘునాథ్

తాండూర్: బీజేపీ తాండూర్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన దూడపాక భరత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ నియామకపత్రాన్ని భరత్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు రజనీష్, పట్టి వెంకటకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు పాల్గొన్నారు.

కోతులకు పండ్లు పంపిణీ

జైపూర్: మండల సమీపంలోని అటవీ ప్రాంతంలో కోతులకు, పక్షులకు పండ్లు, నీరు, చిరుధాన్యాలు షన్ముక సాయిట్రస్ట్ ఆధ్వర్యంలో బేతి సత్యనారాయణ, సభ్యులు లగిశెట్టి విజయ్ పంపిణీ చేశారు.

నీటి కోసం పాట్లు..!

భీమారం: పది రోజుల నుంచి భీమారం మండలం సమీపంలోని సుంకరిపల్లి గ్రామ ప్రజలు నీటిఎద్దడి సమస్య తీవ్రం కావడంతో నానా పాట్లు పడుతున్నారు. నీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం బోరుబావికి మోటార్లు బిగించి పైపుల ద్వారా ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తుండగా, పది రోజుల నుంచి నీళ్లు రావడం లేదని వాపోయారు. మోటారు భాగానే ఉందని, బోరు లోతు కేవలం 110ఫీట్లు మాత్రమే ఉండటంతో బోరులో భూగర్భజలాలు మరింత అడుగంటుకుపోవడంతో నీళ్లు లేకుండా పోయాయని మెకానిక్ తెలిపారు. దీంతో ప్రైవేట్ వ్యక్తుల బోరు బావుల వద్దకి వెళ్లి బిందెల ద్వారా నీళ్లు తెచ్చుకుంటున్నామని ఆరోపించారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వ అధికారులకు, మాకు నీళ్లు రావడం లేదని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని, నీటిసమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. సత్వరమే మిషన్ భగీరథ నీటిని అందించి నీటి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



పనిచేయని బోరుబావి